క్లుప్తంగా

నేడు పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇంటర్వ్యూలకు 58మంది హాజరు



నందిగామ: డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీవో పి.సాయిబాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు ఏడుగురు, 17 ఆయా పోస్టులకు 51మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆర్డీవో తెలిపారు. ఐసిడిఎస్ సిడిపివోలు లక్ష్మీ భార్గవి, భాగ్య రేణుక పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో సవరణకు దరఖాస్తు చేసుకోండి

కంచికచర్ల : ఓటర్ల జాబితాలో పేర్లు, అడ్రస్‌లలో తప్పులు దొర్లినట్లయితే ఫారం–8 ద్వారా తిరిగి సరిచేసుకోవచ్చని తహశీల్దార్ పబ్బారి శంకరబాబు మంగళవారం సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులతో ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలన చేయించి, జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు చెప్పారు. మరోసారి ఓటర్ల జాబితా పరిశీలన చేపడుతున్నామన్నారు. పేరు, తండ్రిపేరు, అడ్రస్‌లో తప్పులంటే ఈ సమాచారాన్ని బీఎల్ఓలకు తెలియజేసి, సరిచేయించుకోవాలన్నారు. స్థానికంగా ఉండనివారి ఓట్లను తొలగిస్తామని చెప్పారు. 18ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటుహక్కు కలిగిఉండాలని ఆయన సూచించారు.

వార్షిక అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ




అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పాఠశాలల వార్షిక అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బి జ్యోతిబ్రహ్మం అధ్యక్షత వహించారు. పాఠశాలల వార్షిక అభివృద్ధి ప్రణాళిక తయారీపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చర్చించారు. హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాల హెచ్ఎంలు అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకుని హాబిటేషన్ ప్లాన్ కోసం పూర్తి స్థాయి వివరాలు ఇవ్వాలని సూచించారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం



నందిగామ టౌన్: సత్యసాయి సేవాసంస్థలు అందిస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. నందిగామ పట్టణంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు హాజరై సత్యసాయి బాబాకి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్ట్ సౌజన్యంతో 12మందికి కుట్టుమిషన్లు, 98 మంది పేదలకు దుప్పట్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, చాపల మల్లికార్జునరావు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై కళాజాత



నందిగామ: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు అందుతున్న సేవలపై మండలంలోని మాగల్లులో మంగళవారం పలువురు కళాకారులు ప్రత్యేక కళాజాత నిర్వహించారు. ఈ కళాజాతను కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ ప్రారంభించారు. అనంతరం కళాకారులు సహకార బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఉద్ఘాటన
- సంక్షేమ, అభివృద్ధి పనుల లబ్ధిని ప్రజలకు వివరించిన నాయకులు



వేములపల్లిలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



జగ్గయ్యపేటలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్

వేములపల్లి(కంచికచర్ల): రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. వేములపల్లిలో మంగళవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలలో 99శాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నాలుగున్నర ఏళ్లుగా వేములపల్లి సచివాలయ పరిధిలో నవరత్నాల పథకాల కింద ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా గ్రామస్తులకు రూ.32,99,33,829 మేర లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ నాయకుల్లా మాయమాటలు చెప్పే అలవాటు తమకు లేదని, మాట ఇచ్చామంటే ఖచ్చితంగా ఎంత కష్టమైనా అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలని, తనను తిరిగి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని గ్రామస్తులను కోరారు. సర్పంచి ఉయ్యూరు అనుమాయమ్మ, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు నల్లపు శ్రీనివాసరావు, సొసైటీఅధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, నాయకులు ఉయ్యూరు

నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, వేల్పుల రమేష్, మార్త శ్రీనివాసరావు, పొపట్ల స్వామి, పసుపులేటి వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే జగనన్న లక్ష్యం...

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): రాష్ట్రాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి పేర్కొన్నారు. ముచ్చింతాల సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ జక్కులూరి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు బేరోతుల నాగమణి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేనికుమారి, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు నూకవరపు శ్రీనివాసరావు, గోనెల శివ, జయరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బూదవాడ గ్రామంలో..

బూదవాడ(జగ్గయ్యపేట): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని బూదవాడలో మంగళవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన లబ్దిదారుల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సామాజికన్యాయం కోసం విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. తద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ బజారు సాయి, గ్రామపార్టీ కన్వీనర్ కరిసె భూపతి, గ్రామ పార్టీ నాయకులు ధారవత్ బాల్యానాయక్, బూడిదె నరసింహారావు, గడ్డం శ్రీనివాసరావు, గంగరాజు, పరిటాల రాంబాబు, రవి, పంచాయితీ కార్యదర్శి శివాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందుగపల్లికి రూ.20కోట్ల లబ్ధి..

ఇందుగపల్లి(వత్సవాయి) : రాష్ట్రంలో అవినీతిరహితంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవయాణి కొనియాడారు. మండలంలోని ఇందుగపల్లిలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఇందుగపల్లి వాసులకు రూ.20కోట్ల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇటువంటి ప్రభుత్వం, ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు అవసరమని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, మండల సచివాలయాల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కిలారు హనుమయ్య, కార్యదర్శి చాందుసాహెబ్, పాపినేని రాంబాబు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: మునుపెన్నడూలేని సంక్షేమం ,అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పేర్కొన్నారు. జగ్గయ్యపేట పట్టణం కాకానినగర్‌లోని పాత గురుకుల పాఠశాలలో వద్దనున్న ఒకటో సచివాలయం వద్ద మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 1, 2, 6వ వార్డుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, 2వ వార్డు కౌన్సిలర్ కొలగాని రాము, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ ఒకటో సచివాలయ పరిధిలోని పట్టణవాసులకు సంక్షేమ పథకాల ద్వారా ఈ నాలుగున్నరేళ్లలో రూ.15కోట్లకు పైగా లబ్ధి చేకూరిందని తెలిపారు. దేశంలో ఇచ్చిన హామీలను 99.5శాతం అమలు చేయడంతోపాటు ఆయా వార్డు, గ్రామానికి ఎంత మేలు జరిగిందో బోర్డులు ఏర్పాటు చేసి మరీ చెబుతున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరిని ఓటు అడిగే దమ్మున్న నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. వార్డు కౌన్సిలర్ కొలగాని రాము, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అవిశ్రాంతంగా కృషి చేస్తుండగా, ఆయనకు ప్రజల్లో మంచిపేరు వస్తుందన్న ఈర్ష్యతో ప్రతిపక్ష టీడీపీ నాయకులు కోర్టుల్లో కేసులు వేస్తూ అభివృద్ధి పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును గెలిపించుకోవాల్సి ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మునిహేరా, సంపూర్ణ పాల్గొన్నారు.

దాములూరులో..

నందిగామ: మండలంలోని దాములూరులో మంగళవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొణతమాత్మకూరు సర్పంచ్ మేడా కోటేశ్వరరావు, పార్టీ నాయకులు కనగాల వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

జయంతి గ్రామంలో.

జయంతి(వీరులపాడు): మండలంలోని జయంతి గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొన్నారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ శీలం సంధ్య, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షహనాజ్ బేగం, బొమ్మిశెట్టి భాస్కరరావు, నువ్వుల విశ్వనాథం, శీలం భాస్కర్‌రెడ్డి, నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కొనకాల సాయికుమార్, కర్ల రాజు, ఎంపీడీవో అరుంధతీదేవి పాల్గొన్నారు.



జయంతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో..



నందిగామ మండలం దాములూరులో..



వత్సవాయి మండలం ఇందుగపల్లిలో..



పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామంలో

జీవన ప్రమాణాల మెరుగునకు కృషి

నందిగామ టౌన్: నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 17, 18వ వార్డుల పరిధిలోని తొమ్మిదో సచివాలయం చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామ సచివాలయంలో మంగళవారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయా సచివాలయాలలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా గొప్పలు చెప్పకుండా మేం ఇది చేశామని బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. తమ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని చెప్పారు. గత ప్రభుత్వ తీరును ప్రస్తుత ప్రభుత్వ పని తీరును బేరీజు వేసుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మంచి జరిగింది అని భావిస్తేనే తమకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు బాపట్ల సాంబయ్య, బండారు గంగమ్మ, వార్డు కన్వీనర్లు పట్టా శ్రీను, బండారు వెంకట్రావ్, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు జగనన్న కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను




మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలుచేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు విశేషంగా కృషిచేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. స్థానిక మెప్మా(ఐకేపీ) కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉదయభాను మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన, సాధికారత, స్వయం సమృద్ధి సాధించేందుకు మునుపెన్నడూ లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని వివరించారు. ఇళ్ల స్థలాలు, గృహాలను మహిళల పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేయడం, అనేక సంక్షేమ పథకాలను కూడా మహిళల పేరుతోనే అందజేయడం ద్వారా జగనన్న మహిళా పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు. డ్వాక్రా మహిళలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రూపులతోపాటు టిడ్కో గృహాలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులతో ఇబ్బందులు ఉంటే బ్యాంకు వారితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

డిసెంబర్ చివరి నాటికి టిడ్కో గృహాలు...


పట్టణంలోని 3,500 టిడ్కో గృహాల వద్ద ప్రస్తుతం రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ తదితర మౌలిక వసతులు కల్పించే పనులు సాగుతున్నాయని ఎమ్మెల్యే ఉదయభాను తెలిపారు. డిసెంబర్ చివరినాటికి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహాల కోసం 14ఎకరాల భూమిని సేకరించగా, స్థలం ఇచ్చిన రైతులకు రూ.3కోట్లు, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ వారికి రూ.45కోట్లు చెల్లించకపోవడంతో పనుల జాప్యం జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ బకాయిలను చెల్లించి మిగిలిన నిర్మాణ పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పట్టణ, మండల సమాఖ్యల అధ్యక్షులు మునిహేరా, శ్యామల, సచివాలయాల పట్టణ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ మహిళా, కార్మిక, ఎస్టీ విభాగాల అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, గోగుల వెంకయ్య, బద్దూనాయక్, సీఎంఎం శ్రీధర్, సీవోలు నిర్మల, వెంకట్, శ్రీదుర్గ, ఆర్పీలు, గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఎంలతో సమావేశం



జగ్గయ్యపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువులో రాణించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని నందిగామ డీవైఈవో మేకతోటి వెంకటప్పయ్య సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఈవైవో మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. నాడు–నేడు పనులను పర్యవేక్షించాలని, పనులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మల్కాపురం జెడ్పీ పాఠశాలకు గణిత ఉపాధ్యాయుడు కావాలని హెచ్ఎం కోరడంతో త్వరలోనే ఉపాధ్యాయుడిని నియమిస్తామని చెప్పారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

నందిగామ పోలీస్‌స్టేషన్ తనిఖీ



నందిగామ: స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని విజయవాడ రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల ఆదేశించారు. ఏసీపీ జనార్దన్‌నాయుడుతో కలిసి నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ఆయా విభాగాలతోపాటు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, సిబ్బంది పనితీరు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో గస్తీ మరింత పెంచాలని సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ హనీష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని జుజ్జూరులో రూ.40లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20లక్షలు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని యజ్ఞదత్తాత్రేయ స్వామి ఆలయంలో కార్తీక శుద్ధ పాడ్యమి సందర్భంగా నిర్వహిస్తున్న అష్టవాజేయ బృహస్పతి నవయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, నాయకులు గోపిశెట్టి నరసింహారావు, పూలా పుల్లయ్య, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో యువత విజయం సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: గ్రూప్–2 పరీక్షలకు ప్రిపేరయ్యే నిరుద్యోగ యువత లక్ష్యసాధనలో విజయం సాధించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆకాంక్షించారు. స్థానిక ఎస్‌జీఎస్ కళాశాలలో మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు గ్రూప్–2 పరీక్షల నూతన సిలబస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ పట్టువదలక కష్టపడితే ప్రభుత్వ ఉద్యోగాలను సాధించవచ్చన్నారు. కష్టపడి చదివి విజయం సాధించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటివారంలో గ్రూప్–2 నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. మొత్తం 900 పోస్టులు ఉండనుండగా, మరో 200 పోస్టులు పెరిగే అవకాశం ఉందన్నారు. అకాడమిక్ పరీక్షలు, పోటీ పరీక్షల మధ్య ఉన్న తేడాను గ్రహించి గ్రూప్–2కు ప్రిపేర్ కావాలని అభ్యర్థులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన 120 పేజీల స్టడీ మెటీరియల్‌ను గ్రూప్–2కి ప్రిపేరయ్యే అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు జి.పల్లవి అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి జి.ముక్తేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు జె.సుధానంద్, షేక్ హుస్సేన్, బి.రమణయ్య, పెనుగంచిప్రోలు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎండీ జిలానీ, సుబ్రహ్మణ్యం, వత్సవాయి ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి ప్రభ, గ్రూప్–2 అభ్యర్థులు పాల్గొన్నారు.

నందిగామలో చిరుజల్లులు

నందిగామ: డివిజన్ పరిధిలో వాతావరణం మంగళవారం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంది. మధ్యాహ్నం సమయంలో ఒక మోస్తారు చిరు జల్లులు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.